క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సంగెం : మండలంలోని పల్లారుగూడలో బాధిత కుటుంబాలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ తారాచంద్‌నాయక్ కుమారుడు వీరాచంద్‌నాయక్ అనారోగ్యంతో మృతి చెందగా అతడి మృతదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బొమ్మ రాజ్‌కుమార్, పాడేటి ఏలియా కుటుంబాలను పరామర్శించారు. ఏలియా కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పల్లారుగూడ అధ్యక్షుడు గుగులోత్ స్వామి, మాజీ ఎంపీపీ బొమ్మల కట్టయ్య, నాయకులు పాడేటి సాంబయ్య, జన్ను కుమారస్వామి, కక్కెర్ల మల్లేశం, సదానందం, చారి, స్వామి పాల్గొన్నారు.

ఎస్సైగా మహేందర్ బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : స్థానిక ఎస్సైగా మహేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి విధులు నిర్వర్తించిన షేక్ జానీపాషా గీసుగొండకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జనగామ జిల్లాలోని జఫర్‌గఢ్ నుంచి నెక్కొండకు మహేందర్ బదిలీపై వచ్చారు. ఎస్సై మహేందర్‌ను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైగా అరుణ్..



చెన్నారావుపేట : స్థానిక ఎస్సైగా గూడ అరుణ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. జనగామ ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయనను పోలీస్ శాఖ ఉన్నతాధికారులు మండలానికి బదిలీ చేసిన క్రమంలో ఆయన చేరారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్సైగా రఘుపతి..



ఖానాపురం : స్థానిక ఎస్సైగా రఘుపతి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన మాధవ్ వరంగల్‌కు బదిలీ కాగా జనగామ జిల్లాలోని రఘునాథపల్లి ఎస్సైగా పని చేస్తున్న రఘుపతి ఇక్కడకు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎస్సై రఘుపతికి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకుడు



పర్వతగిరి : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లోని సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు శ్రీపాద సతీశ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడవక ముందే ఆరు గ్యారంటీల్లో నాలుగిటిని అమలు చేస్తున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు.

'సాంఘిక బహిష్కరణ దుర్మార్గం'

నర్సంపేట : నిజామాబాద్ జిల్లాలో 82 గౌడ కుటుంబాలను గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సాంఘిక బహిష్కరణకు గురి చేయడం దుర్మార్గమని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకు దెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ అన్నారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. గత నెల జగిత్యాలలో అగ్రకులాలు గౌడ కుటుంబాలను బహిష్కరించిన ఘటన మరువక ముందే నిజామాబాద్ జిల్లాలోని చౌట్‌పల్లికి చెందిన గౌడ కుటుంబాలను వీడీసీ సభ్యులు బహిష్కరణకు గురి చేశారని చెప్పారు. ఎస్పీకి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం స్పందించి నిందితులపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి'

పర్వతగిరి : గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన నేపథ్యంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ కోరారు. మండల కేంద్రంలో విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టినప్పటి నుంచి సాగించిన ప్రజావ్యతిరేక పాలనను ఎండగట్టారు.

విధుల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం



విద్యార్థితో గేట్ తాళం తీయిస్తున్న ఉపాధ్యాయురాలు

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి తెట్టికుంటతండా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం 9.55 గంటలైనా ఉపాధ్యాయులు రాకపోవడంతో తాళం వేసి ఉండడంతో విద్యార్థులు గోడ దూకి పాఠశాలలోకి వెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అక్కడికి చేరుకున్న జర్నలిస్టులు ఉపాధ్యాయులు కరుణ, సురేశ్‌ను వివరణ కోరగా నిర్లక్ష్యమే సమాధానమైంది. 'మా ఇష్టం, ఇక్కడ మీకేం పని, మమ్మల్ని అడిగే హక్కు మీకెవరు ఇచ్చారు' అంటూ ఉపాధ్యాయులు దురుసుగా మాట్లాడారు. ప్రతిరోజు ఇదేతంతు కొనసాగుతోందని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయపాలన పాటించకపోడంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని వాపోయారు. ఉపాధ్యాయుల తీరుపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై హెచ్ఎం సురేశ్‌ను వివరణ కోరగా పాఠశాలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

'ఎస్‌జీఎంబీవై'ని వినియోగించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్, నాయకులు

నర్సంపేట : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (ఎస్‌జీఎంబివై) పథకాన్ని వినియోగించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ కోరారు. ఆ పథకానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక పోస్టాఫీస్‌లో శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజలకు రుణ భారం లేకుండా భారీ సబ్సిడీతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసేందుకు ప్రధాని మోదీ సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునే కుటుంబాలకు రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. ప్రజలు పోస్టాఫీసుల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహరాములు, పట్టణ అధ్యక్షుడు బాల్నె జగన్, సీనియర్ నాయకులు శీలం సత్యనారాయణ, యువమోర్చా పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, ప్రధాన కార్యదర్శి ఠాకూర్ విజయ్‌సింగ్, బూత్ అధ్యక్షులు రమేశ్ పాండే, చెను నరేశ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ ఠాకూర్ శివాంజనేయ సింగ్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



గీసుకొండ : నేతాజీ సర్వీస్ టీమ్ ఆధ్వర్యంలో రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ ఆర్థికసాయంతో మండల కేంద్రంలోని జెడ్పీ, గ్రేటర్ పరిధిలోని 14వ డివిజన్‌లోని సుందరయ్యనగర్ ప్రభుత్వ హైస్కూళ్లలో టెన్త్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు రాయడానికి అవసరమైన పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్లు, ఇతర సామగ్రిని సీఐ బాబూలాల్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ మాట్లాడారు. విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సర్వీస్ టీమ్ వ్యవస్థాపకుడు శంకర్, హెచ్‌ఎంలు పట్టాభి, జ్యోత్స్న ప్రభ, ఎడ్ల మంజుల, సభ్యులు బరుపటి అనిల్, మండ సాయి, భగత్, కిరణ్, రాజ్‌కుమార్, సాయి, హరీశ్, శివ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తరగతులు బోధించి, విధులు నిర్వర్తించి ఆకట్టుకున్నారు. హెచ్‌ఎంగా బోడ రాజేందర్, ఎంఈఓగా, డీఈవోగా వేముల రాంచరణ్, వ్యాయామ ఉపాధ్యాయుడిగా బోడ తరుణ్, అటెండర్‌గా వేముల లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆంగోతు భద్రయ్య, ఉపాధ్యాయులు స్వామి, కుమారస్వామి, యాకయ్య, రజిత, స్వర్ణలత, రమాదేవి, అనిత, పావని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

వర్ధన్నపేట : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని దమ్మన్నపేట శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని హిమ్మత్‌నగర్‌కు చెందిన 8 మందితో ప్రయాణిస్తున్న ఆటో, జఫర్‌గఢ్ దిశగా వెళ్తున్న బైక్ దమ్మన్నపేట శివారులోని పెద్దమ్మ గుడి సమీపంలో ఒకదానికి మరొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కనకల అరుణకు, బైక్‌పై ప్రయాణిస్తున్న చిటిమల్ల బాబు, చిట్టిమల్ల జనార్దన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న విశ్వనాథం, రమ, గాండ్ల సంధ్య, బుడిగం కళావతి, కొండేటి సోమలక్ష్మిలకు స్వల్పగాయాలు కాగా వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ ఢీకొని..

రాయపర్తి : బైక్ ఢీకొని సైకిలిస్టుకు గాయాలయ్యాయి. వివరాలిలా.. మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన శీల లక్ష్మారెడ్డి సైకిల్‌పై వెళ్తుండగా వర్ధన్నపేట మండలంలోని గుబ్బెడితండాకు చెందిన బానోత్ హుస్సేన్ నడుపుతున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మారెడ్డికి గాయాలు కాగా స్థానికులు వర్ధన్నపేట ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి సంఘాల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఏబీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ మాట్లాడారు. ఇంటర్, పోటీ పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించబోమనే నిబంధనను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన నేపథ్యంలో బస్సుల్లో పరీక్ష కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. ఇంటర్ బోర్డ్, ప్రభుత్వం స్పందించి ఇంటర్ విద్యార్థులకు, ఇతర పరీక్షల అభ్యర్థులకు 30 నిమిషాలు ఆలస్యమైనా పరీక్షలకు అనుమతించేలా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చింతం సిద్ధు, ప్రశాంత్, భూషణ్ పటేల్, శ్రీకాంత్, ప్రమోద్, రమ్య, సావిత్రి, అనిత, భాగ్యలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యం'



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : బీజేపీ పార్టీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, నియోజకవర్గ కోకన్వీనర్ తడుగుల విజయ్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బాబు రాజు తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌దీప్, విజయ్, బాబు రాజు మాట్లాడారు. మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ దండోరా ఉద్యమ చరిత్రలో అనేక పోరాటాలు నిర్మించినట్టు చెప్పారు. మాదిగ, ఉపకులాల ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ దేశ ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లడంతో కేంద్ర కేబినెట్ సెక్రటరీ హోదాలో కమిటీ వేశారని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పునకు దగ్గరలో ఉందన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మాదిగ, ఉపకులాల ప్రజలు బీజేపీకి అండగా నిలవాలని సూచించారు. ఈనెల 7న మంద కృష్ణ నాయకత్వంలో మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని చెప్పారు. సమావేశానికి మాదిగ, ఉపకులాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బోయిని నారాయణ, వేల్పుల సురేశ్, దామెర సుధాకర్, శ్రీనివాస్ ఆచారి, ఉప్పన్న, రాములు, సదానందం, రజిత, అనిత, రాజు, రవి, పద్మ, విజయ, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి జక్కి శ్రీకాంత్



వర్ధన్నపేట : మండలంలోని నల్లబెల్లికి చెందిన జక్కి శ్రీకాంత్ సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడుగా గతంలో పని చేసిన ఆయన హనుమకొండలోని డీసీసీ భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీలో మళ్లీ చేరారు. ఆయనకు డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శ్రీకాంత్‌తోపాటు నాయకుడు దొమ్మటి సాంబయ్య ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్ మాజీ వార్డు సభ్యుడు సూరారపు రవికుమార్, చిన పెల్లి రాజు, చినపెల్లి కుమార్, బుర్ర చందర్, బిర్రు యాకయ్య సహా సుమారు 50 మంది వివిధ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అభినందించారు. కష్టకాలంలో పని చేసిన నాయకులను పార్టీ వదులుకోదన్నారు. కార్యకర్తల వల్లే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని చెప్పారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కర్ర శ్రీనివాసరెడ్డి, దేవేందర్ రావు, బర్ల సహదేవ్, చింత బాబు, బాబు, ఏలియా, యాకయ్య, సమ్మయ్య, చంద్రయ్య, నాగరాజు, రమేశ్, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న మేనేజర్ బంగారయ్య

వర్ధన్నపేట : ప్రధాన మంత్రి జీవన జ్యోతి పథకం కింద రూ.436 చెల్లించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో బీమా చేయించుకున్న ఖాతాదారులు ఇద్దరు మృతి చెందగా బాధిత కుటుంబాలకు మేనేజర్ బంగారయ్య శుక్రవారం బీమా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన పనికర కొమురయ్య, హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లికి చెందిన హైమద్ అలీ కొంత కాలం క్రితం వివిధ కారణాలతో మృతి చెందారు. వారికి బ్యాంకులో జీవన జ్యోతి బీమా ఉండడంతో లక్ష రూపాయలు చొప్పున డబ్బులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ రామగిరి శ్యాంప్రసాద్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న విశ్వ ఫౌండేషన్ ప్రతినిధులు

గీసుకొండ : విశ్వ ఫౌండేషన్, అగ్నిహోత్ర టీమ్ ఆధ్వర్యంలో మండలంలోని గంగదేవిపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ విశ్వ ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ టీమ్ సభ్యుడు సింగిరెడ్డి కుమారస్వామి మాట్లాడారు. గ్రామ మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి కోరగా విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫయర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అగ్నిహోత్ర ధర్మ సైనికులు గొంగ శ్రీనివాస్, వేణుగోపాల్, సత్యనారాయణ, వినయ్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత కీలకం



చెన్నారావుపేట : విద్యార్థులు అభివృద్ధి సాధించాలంటే సృజనాత్మకత కీలకమని తిమ్మరాయినిపహాడ్ విచారణ గురువు ఫాదర్ యాగారెడ్డి, సెయింట్ థెరిస్సా స్కూల్ కరస్పాండెంట్ ప్రజలీనా తెలిపారు. మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లోని ఆ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను వారు పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరిగేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులతో సృజనాత్మకతను వెలికితీసేలా ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరోగ్య శౌరి, ఫాదర్ రాయపురెడ్డి, ఉపాధ్యాయుడు సీతారామాచార్యులు, సిస్టర్లు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



చెన్నారావుపేట : మాట్లాడుతున్న ఫణికుమార్



ఖానాపురం : మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

చెన్నారావుపేట : ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ ఫణికుమార్ తెలిపారు. తన కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పెండింగ్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్ సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. మండలంలో 110 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. దరఖాస్తుల పరిష్కార ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని రెవెన్యూ సిబ్బంది వాట్సప్, ఎస్ఎంఎస్‌ల ద్వారా దరఖాస్తుదారులకు పంపాలని చెప్పారు. దరఖాస్తుదారులు తహసీల్ కార్యాలయానికి సంబంధిత ఆధారాలతో వచ్చి సమస్య పరిష్కారానికి సహకరించాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ స్వామి, సీనియర్ అసిస్టెంట్ రవి, సర్వేయర్ విద్యశ్రీ, ఏఎస్ఓ రవళి, జూనియర్ అసిస్టెంట్ అమ్జద్ ఖాన్, శీలం రాజు, శోభారాణి, రాజు, సంతోశ్, రికార్డ్ అసిస్టెంట్ కోటి, నర్సింహస్వామి, శ్రీనివాస్, టైపిస్ట్ సామ్రాట్, క్రాంతి పాల్గొన్నారు.

సమర్థవంతంగా పని చేయండి

ఖానాపురం : భూసమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పని చేయాలని సిబ్బందికి తహసీల్దార్ కిరణ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను సిబ్బందికి వివరించారు. అనంతరం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి మాట్లాడారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించాలని, దరఖాస్తుదారులకు ఇబ్బంది కలుగకుండా సమర్థవంతంగా వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



వర్ధన్నపేట : మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్



సంగెం : మాట్లాడుతున్న మౌనిక

వర్ధన్నపేట : సమాజంలోని ప్రతీఒక్కరికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కౌన్సిలర్ ఎం.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు పురస్కరించుకుని ఆర్‌బీఐ ఆదేశాల మేరకు నాబార్డు ఆర్థిక సహాయంతో ఇల్లందలోని ఆ బ్యాంకు శాఖ ఆధ్వర్యంలో దమ్మన్నపేటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులు బ్యాంకులు అందించే పొదుపు ఖాతాలు, రుణాలు తదితర సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్ నాయక్, సీఎఫ్ఎల్ కమలాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సంగెం : విద్యార్థులు, యువత ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ కౌన్సిలర్ మౌనిక కోరారు. మండల కేంద్రంలోని విద్యాభారతి హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, క్యూఆర్ కోడ్ ద్వారా జరిగే మోసాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌తో నష్టాలు, తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ వెంకయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ చందర్‌రావు, బ్యాంకు ఉద్యోగి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యయనంతోనే జీవితంలో ఉన్నతి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

పర్వతగిరి : పుస్తకాల అధ్యయనంతోనే జీవితంలో ఉన్నతి సాధించగలరని లీడ్ చిల్డ్రన్స్ లైబ్రరీ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ శోభరాణి తెలిపారు. మండలంలోని కేజీబీవీలోని గ్రంథాలయానికి లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన శుక్రవారం పుస్తకాలు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు పుస్తకాలు అధ్యయనం చేయడాన్ని అలవర్చుకుని జ్ఞానాన్ని సముపార్జించాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాశాఖ మండల నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం లైబ్రరీకి పుస్తకాలు బహూకరించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం రవికుమార్ శోభరాణిలను కేజీబీవీ సిబ్బంది శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, స్వేరో జిల్లా నాయకులు గారె జయరాజ్, జంగిలి యాకయ్య, బానోతు రమేశ్ పాల్గొన్నారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు



రాయపర్తి : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ఉద్యోగం సాధించడమే గగనం. ఒకేసారి రెండు ఉద్యోగాలను సాధించి కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులతో శభాష్ అనిపించుకుంటున్నారు మండల కేంద్రానికి చెందిన సమ్మెట భిక్షపతి, యశోద కుమార్తె రజిత. ఇటీవలే ప్రకటించిన ఫలితాల్లో పీజీటీగా ఎంపికయ్యారు. గురువారం ప్రకటించిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు రజితను అభినందించారు.

సదరం క్యాంపులు నిర్వహించాలి



నర్సంపేట : పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహించాలని కోరుతూ దివ్యాంగుల స్పెషల్ గ్రీవెన్స్‌లో దివ్యాంగుల సంక్షేమ సంఘం, నవతెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్పందించారని చెప్పారు. ఈనెల 16, 19, 21 తేదీల్లో నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంప్ నిర్వహించనున్నట్లు చెప్పారని తెలిపారు. రెన్యూవల్ చేసుకునే, కొత్త దరఖాస్తుదారులు ఈనెల 4న సాయంత్రం 3 గంటల వరకు మీసేవ సెంటర్లలో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌కు దివ్యాంగుల తరఫున దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.